# అనురాగపు అంచులు

-'శ్రీవిరించి'

సుందరమ్మ వరండాలోకి వచ్చి కూర్చుంది.

చలిగాలి విసురు తగ్గింది గాని ఇంకా వాతావరణం తడి తడిగానే వుంది. పక్క వాటాల వరండాలలో ఎవరూ కనబడలేదు. అందరూ చలికి బిగుసుకుపోయి గదుల్లోనే ముగ్గిపోతున్నారు!

పక్క ఎపార్ట్‌మెంట్లను అనుకుని బుల్‌డోజర్లు వున్నాయి. ఒకటి కాదు. నాలుగు. వాటి బ్లేడ్లు వెడల్పుగా పదునుగా నిగనిగలాడుతున్నాయి. ఆదిశేషువు తలలో నాలుకల్లా ధగధగమెరుస్తున్నాయి. బుల్‌డోజర్లు నడిపించడం మొదలెడితే చాలు, ఆ యిళ్లన్నీ ధ్వంసం అయిపోతాయి. ఆ ఎపార్ట్‌మెంట్లు పడగొట్టటం అయిపోయిన తర్వాత, తాను వుంటున్న యింటి మీదకు వస్తారు– కార్పొరేషన్ వాళ్లు.దయ, దాక్షిణ్యం లేకుండా యీ యింటినీ కూలగొట్టేస్తారు. దయ, దాక్షిణ్యం లేదని ఎందుకు అనుకోవాలి? – ఇప్పటికి నాలుగు యేళ్లుగా చెబుతున్నారు ఖాళీచేసి వెళ్లిపొమ్మని. ఆ యిళ్లు వుండటానికి ఎంత మాత్రం వాసయోగ్యంగా లేవు. దయతోనే వాటిని కూల్చివేసి, అక్కడ కొత్తగా భవనాలు నిర్మించాలని ప్రణాళిక.

అనుమతి లేకుండా కట్టడాలు నేలమీద నుంచి ఆకాశానికి ఎగరడం అలవాటు అయిపోయింది, కట్టడం పనులన్నీ చకచకా జరిపేసే యంత్రాలు వచ్చేసిన తరువాత – కళ్లు మూసి తెరిచే లోపలే ఖాళీ స్థలంలో ఓ దివ్య భవనం దిగి వచ్చినట్లుగా కనిపిస్తుంది.

ఇంతకూ సుందరమ్మ దిగులు అది కాదు.

పది రోజుల నుంచి ఒంట్లో ఓపిక లేదు.

జ్వరం వచ్చింది. మందులు కొనుక్కోవటానికి కూడ డబ్బు లేదు చేతిలో. అలాగే కాలక్షేపం చేసింది – ఉన్నదేదో 'పథ్యం'గా తింటూ, ఎక్కువగా అటూ యిటూ తిరగకుండా, మాట్లాడుతూ హైరాణ పడకుండా.

ఆ యిళ్లల్లో అందరిలోకీ సుందరమ్మే పెద్దది.

వయసులో పెద్దరికంతో పాటు, ఆమె కొడుకు యూనివర్సిటీలో ప్రొఫెసర్ గనుక యింకాస్త గౌరవం.

ఈ కుర్రాడిని ఎట్లా పెంచిందీ, ఎట్లా విద్యాబుద్ధులు నేర్పిందీ, పెళ్లీ పేరంటం చేయించిందీ... యిదంతా ఆమె వివరంగా చుట్టుపక్కల వాళ్లకు కథలుగా చెబుతూ వుంటుంది. ఎన్నిమార్లు యెన్ని మలుపులు తిప్పి చెప్పినా అందరూ ఆమె మీద వున్న గౌరవం వల్ల శ్రద్ధగా వింటున్నట్లే కనిపిస్తారు.

'ఏమర్రా అందరూ యేమయిపోయారు?' అని పెద్దగా ఓ కేక వేసింది.

అంత పెద్ద కేక వేయగలగడం ఆమెకే ఆశ్చర్యం అనిపించింది.

ఇద్దరు ముగ్గురు తమ వరండాల్లోకి వచ్చారు. సుందరమ్మను చూచి పలకరింపుగా నవ్వారు, చేతులు ఊపారు.

'పిన్నిగారూ! కులాసాగా వున్నారా? చలిగాలి వల్ల ఎవళ్లం రానేలేదు...' అని పలకరించింది ఎదురు వాటా 'అసూయమారి అనసూయ'. ఆమె పేరు అనసూయే, అయినా ఆమెకు 'అసూయ' ఎక్కువని సుందరమ్మ అభిప్రాయం. అందుకని అప్పుడప్పుడు అలా పిలుచుకుంటూ తనలో తాను తృప్తిపడుతూ వుంటుంది, సమాధాన పడుతుంది.

పక్కవాటా సుజాత కూడా బయటకు వచ్చింది. నిజానికి అయిదారు నిమిషాలలో ఆరుగురు పరిచయస్థులూ తమ వరండాలలోనికి వచ్చేశారు.

సుందరమ్మ ఆరోగ్యాన్ని గురించి విచారించి ఆమెకు ధైర్యం చెప్పారు. ఆమె వాళ్లందరికీ అతి హుందాగా కృతజ్ఞతలు చెప్పింది. 'బాగా చలిగా వుంది. ఎక్కువసేపు ఆరుబయట వుండడం మంచిది కాదు. అందరూ లోపలకు వెళ్లి తలుపులు బిగించుకోండి–' అని ఆదేశించి అందర్నీ పంపివేసింది.

సుందరమ్మ నీలాకాశం వంక చూచింది కాస్సేపు.

కదలాడుతున్న చెట్ల కొమ్మలు, ఆకులు గమనించింది మరికాస్సేపు.

బుల్‌డోజర్ వంక చూచింది ఆ తరువాత. రెండు వారాల నుంచి సుస్తీగా వున్నా, యింట్లో అవసరాన్ని బట్టి వంటికి సరికొత్త శక్తి ఆపాదించుకుని బయటకు వెళ్లటానికి గాను దుస్తులు సరిచేసుకుంది. 'అబ్బాయి యింటికి వెళ్లి ఒకమారు చూచి రావాలి. లేకపోతే ఎట్లా?' అనుకుంది.

దుస్తులు వేసుకోవడం అయినాక, గోడపక్క బీరు

వాలో వున్న బొమ్మల వంక చూచింది. ఓ చిన్న చెక్క పెట్టె, చేతి సంచిలో వేసుకుంది. మనమడికో ఆట వస్తువు! తలుపులు మూసేసి తాళం వేసుకుని బయటకు బయలుదేరింది.

గాలి విసురు ఆమె కోసమే అన్నట్లుగా ఎక్కువ యింది. అన్ని దిక్కుల నుంచి విసిరి విసిరి కొడుతోంది. దానికి ఎముకలు కొంకర్లు పోతున్నాయి. కదలకుండా రెండు మూడు క్షణాలు నిలబడిపోయింది. గోడ పట్టుకుంది ఆసరా కోసం. ఉహు. బయటకు వెళ్లడం - ఈ వాతావరణంలో - తనవల్ల కాదు, ఇంట్లోకి తిరిగి వెళ్లిపోదాం... అనుకుంది. కాని.. అవసరం మనసులో స్థిరంగా స్థావరించుకుంది. తప్పదు, వెళ్లాలి. రేపు పొద్దున్నకు ఏవయినా సరుకులు తెప్పించుకోకపోతే.. మరో పదిహేను రోజులు పస్తే. ఇంకా పెన్షన్ రావటానికి చాలా రోజులు పడుతుంది. ఈ లోపల కొడుకు, కోడలు దగ్గర్నుంచి కొంత పైకం తెచ్చుకోవడం తప్పనిసరి.

ఎలాగయితేనేం, శ్రమపడి కొడుకు యింటికి చేరుకుంది. చాలా దూరం కిందే లెక్క. దానిని, గాలి విసురును లెక్కచేయకుండా.. అవసరం వెంట తరుముతోంది గనుక... ఎలాగో నడిచి రాగలిగింది.

వణుకుతున్న చేతివేళ్లతోనే 'డోర్ బెల్' నొక్కింది. ఒక్క క్షణం నొక్కి వేళ్లు వెనక్కు తీసుకుంది. ఎవరి కయినా, ఎక్కువసేపు ఘంటానాదం చెవుల పడితే చిరాకే. అందులో కోడలు పిల్లకు మరీని!

కోడలు తలుపు తీసింది. సుందరమ్మ ప్రయత్న పూర్వకంగా ముఖమంతా నవ్వులు నింపుకుంది.

'రండి-రండి-' అంటూ లోపలకు తీసుకువెళ్లింది, కోడలు. 'ఇంత చలిలో ఎలా రాగలిగారు?..'

సుందరమ్మకు నడకతోను, అలసటతోను చాలా నీరసంగా వుంది. నిలబడటానికి కూడా ఓపిక లేదు. వంట గదిలో ఓ కుర్చీలో శరీరం జారవేసింది.

'ఉండు. కాస్సేపు ఊపిరి తిప్పుకోనీ! అలసటగా వుంది...' అంది.

'ఏం, అలా వున్నారు? మరీ అంత నీరసంగా.. నిస్త్రాణగా...' అంటూ ప్రశ్నలు వేయసాగింది కోడలు.

'రెండు వారాలయి లేవడంలేదు. పడకలోనే వుండిపోయాను...' అంది సుందరమ్మ. మందులు కొనుక్కునేందుకు డబ్బులేదని చెప్పడం ఆమెకు యిష్టం లేకపోయింది. మాటలు గొంతులోనే మింగేసింది.

'ఇళ్లన్నీ నీటిమయం అయిపోతున్నాయి. చలిలో.. అంతా కష్టంగా వుంది.'

'ఇంకా మీ అపార్ట్‌మెంట్ పడగొట్టలేదా కార్పొరేషన్ వాళ్లు?' అనడిగింది కోడలు టీ కెటిల్ పొయ్యి మీద అమరుస్తూ.

'బుల్‌డోజర్లు వచ్చాయి. పక్క అపార్ట్‌మెంట్ల పని అవగానే, మా యిళ్లమీదా పడతారు..' అంది సుంద రమ్మ నీరసంగా.

'మంచి వార్తే!' అంది కోడలు నవ్వుతూ.

సుందరమ్మ సంచిలో నుంచి మనమడి కోసం తెచ్చిన ఆటవస్తువు పైకి తీసి బల్లమీద వుంచింది.

కోడలు దాన్ని ఎగాదిగా చూసింది. 'మీ అబ్బాయి కూడా పోయిన నెల మాస్కో నుంచి ఇలాంటిదే తీసుకువచ్చారు-' అంది మురిసిపోతూ.

ఇంతలో కుర్రాడు కళ్లు నులుముకుంటూ అక్కడకు వచ్చాడు. నాయనమ్మను చూడగానే ఆమె వడిలోకి గంతువేసి బల్లమీది ఆటవస్తువు అందుకున్నాడు.

'ఎవరు తెచ్చార్రా యిది?'

'నువ్వే!'

'ఎందుకు?'

'నా పుట్టిన రోజు కదూ. అందుకు-'

## కిటికీదారులు

కిటికీతలుపులు తెరిచాక
వెలుతురు కిరణాల ముద్దులకి
సువాసిత మందమారుతపు కౌగిలికి
చీకటి మదిగోడలు చెదిరి
చూపుల కొనల దగ్గర
'దడి' పాతుకుంటున్నయ్
చీకటికి చురక పెడుతూ
బంధనాలను దాటుకుంటూ
ఊహా సౌధాలలో విహరిస్తూ
నవాలోచనోర్మికల ఊయలలూగుతూ
నిశ్చల కాసారం నుండి
నిత్య ప్రవాహంలోకి పయనిస్తూ
విశాల విశ్వంలో శ్వేత విహంగమై విహరిస్తూ
అభ్యుదయపు వాకిళ్లు తడుతూ
నిత్య ప్రయాణికుడినౌతున్నా
మీరు కూడా
మీ చీకటి గదులకు
కిటికీదారులు తెరవండి

-నూతలపాటి వెంకటరత్నశర్మ

'ఎన్నో పుట్టిన రోజో తెలుసా?'

'నాలుగు...'

సంభాషణ యింతతో నిలిచిపోవలసి వచ్చింది. కోడలు ఆటవస్తువును కుర్రవాడి చేతుల్లోంచి తీసుకుని మళ్లీ బల్లమీద పెట్టేసింది. కుర్రాడిని స్నానం చేయించటానికి లోపలకు తీసుకుపోయింది.

తిరిగి వచ్చింతర్వాత, 'విశ్రాంతిగా కూర్చోండి. పోనీ, కాస్సేపు పడుకుంటారా?' అనడిగింది కోడలు.

'లేదు. ఇంటికి వెళ్లిపోతాను' అంది అప్రయత్నంగా. నిజానికి ఆమెకు సుస్తీ సాంతం నయం అయ్యేంత వరకూ యిక్కడే వుండిపోవాలని, కొడుకు– కోడలు– మనవడితో కులాసాగా కాలక్షేపం చేయాలనీ వుంది. కోడలు కూడా మరేమీ తనను ప్రత్యేకంగా వుండమని అనలేదు. అందుకని సుందరమ్మకు అలవోకగా యీ మాటలు పైకి వచ్చేశాయి.

ఒక నిమిషం గడిచింది.

'టైం ఎంతయింది?' అనడిగింది సుందరమ్మ.

కోడలు చెప్పింది.

'అబ్బాయి యింటికి రావడం ఆలస్యం అవుతుందా?' అనడిగింది.

'ఆయన యిప్పుడప్పుడే ఎక్కడ వస్తారు? అయిందింటి వరకు యూనివర్సిటీలో పనితోనే సరిపోతుంది. తరువాత అటునుంచి అటే టి.వి. స్టేషన్‌కు వెడతారు. ఇవాళ "పిల్లల పెంపకం" మీద ఆయన ప్రసంగం వుంది. టి.వి.లో... రాత్రి ఏడున్నరకు. అయినా.. మీకు టి.వి. లేదుగా.. పోనీ, పక్కవాళ్ల యింట్లో ఎక్కడయినా చూడండి–' అంది కోడలు.

అప్పుడే మనమడు పరుగెత్తుకుంటూ వచ్చాడు మళ్లీ.

'నాయనమ్మా.. నా బొమ్మ యివ్వు–' అనడిగాడు. సుందరమ్మ యిచ్చింది.

లేచి నిలబడి తననంచి సరిచూచుకుంది, బయలుదేరబోతున్నట్లుగా.

'ఏమంత తొందర?... టీ తయారవుతోంది. ఆగండి. కూర్చోండి–' అంది కోడలు నసుగుతున్నట్లుగా.

సుందరమ్మ కూర్చోలేదు. 'గ్యాస్ ఆఫ్ చేయడం మరచిపోయాననుకుంటాను. వెంటనే వెళ్లిపోవాలి' అంది.

ఆమె గుమ్మం దాటుతో వుండగా కోడలు అడిగింది: 'మీకు కొత్త ఫ్లాట్ యిస్తారు గదూ?'

'ఆ! పాతది బుల్‌డోజర్ల పాలిటికి నేలమట్టం కాగానే!...' అంది సుందరమ్మ.

'మీకు రెండు గదుల ఫ్లాట్ యిస్తారుగదూ?' అని మళ్లీ అడిగింది కోడలు.

'అవును. లెక్కల్లో నేనొక్కదాన్నే కాదుగా. నాతో పాటు మనమడి పేరు వ్రాయించాను గదూ!'

నిజానికి యీ ఆలోచన ఆమె కొడుకుది. మనమడు కూడా వున్నాడంటే– రెండు గదుల యిల్లు యిచ్చి

## అనునిత్యహృదయం

ఎంత గొప్పది గుండె
ఎప్పుడూ స్పందిస్తూనే వుంటుంది
ఎంత పెద్దది గుండె
నిరంతరం నినదిస్తూనే వుంటుంది
ఎన్నిబాధలనైనా
ఇట్టే దిగమ్రింగుతూ వుంటుంది
ఎంతటి సంతోషాన్నయినా
కుదించకుండా స్వీకరిస్తుంది
ఎక్కడ వ్యాఘాతం జరిగిందనివిన్నా
ఇక్కడ కుమలడం ఆరంభిస్తుంది
దూరాల్లోని అవరోధాల నధిగమించి
దూసుకుపోవడంలో ముందుంటుంది
ప్రమాదాలు పరిహసించినప్పుడూ
ప్రమోదాలను పరిశీలించినప్పుడు
కార్యకరణాలతో సంబంధం లేకుండా
కంటిలో తడిని చేరుస్తూ వుంటుంది.
అన్ని అవయవాలతోనూ దానికి
అవినాభావమైన రక్త సంబంధముంది
కళ్ళు వీక్షించినా, వీనులు విని ఉలిక్కిపడినా
హృదయం ఉద్విగ్నమై ద్రవహిస్తుంది
వసంతాలకు జేజేలు పలకడంలోనూ
శిశిరానికి సానుభూతిని ప్రకటించడంలోనూ
హేమంతానికి శ్రీకారం చుట్టడంలోనూ
వర్షరుతువు వొడిలోకి చేరగా పులకించడం
లోను
గ్రీష్మాన్ని గీచి గీచి రాపెట్టడంలోనూ
శరదృతువులో శరసంధానం చేయడంలోను
నైపుణ్యాన్ని ప్రదర్శించే ప్రవీణహృదయం
అది నిత్యనూతనమై నిగారిస్తూనే వుంటుంది.

–రావెల పురుషోత్తమరావు

తీరాలి, లెక్కప్రకారం. దాని కోసమే యింకా ఆ ముస లామె నీళ్ళు నిండుకుంటున్న యింట్లోనే వుండి పోయింది కూడా! కోడలు యింకా యిలా సాగించింది: 'మా చెల్లెలు ఊరికి దూరంగా ఎక్కడో వుంది. మీకు తెలుసు కదూ. అద్దెకు తీసుకున్నారు ఆ యిల్లు. మీకు యిల్లు కేటాయింపు కాగానే, ఆ యిల్లు వాళ్ళకు యిచ్చే ద్దామంటున్నారు మీ అబ్బాయి. మీరు ఎంచక్కా యిక్కడే మాతోపాటు వుండచ్చు!'

–సుందరమ్మకు యీ మాటలన్నీ వినడం యిష్టంగా లేదు. అత్యవసరంగా డబ్బు కావాలి. రేపు పొద్దుటే కావలసిన సరుకులన్నీ తెప్పించుకోవాలి!

'అమ్మాయీ, నాకు కొద్దిగా డబ్బు కావాలి. నా పెన్షన్ రావటానికి యింకా టైం పడుతుంది' అంది కోడలుతో.

'అలాగా!' అంటూ కోడలు మళ్లీ యింటిలోకి వెళ్లింది– ఓ యాభై కాగితం తీసుకు వచ్చి ఆమె చేతికి అందించింది.

'మీకు ఎక్కువ ఖర్చులేదు. దుబారా చేయరు. పెన్షనంతా ఏమయిపోతోంది?' అనడిగింది కోడలు– సాధింపు ధోరణిలో.

సుందరమ్మ జవాబు చెబుదామనుకుంది. అయినా మాటలు మింగేసింది. తన గుండె చప్పుడు చెవులకు ధాటిగా వినిపిస్తోంది. చేతిలో యాభై కాగితం యెగిరి పోదామా అని అల్లలాడుతోంది. ఆమె దాన్ని నీరసంగా సంచిలో కూరింది. ఆమె వెనకనే తలుపు మూతపడింది. ఆ చప్పుడు యింకా ఆమె చెవుల్లో మోగుతూనే వుంది.

సుందరమ్మ తాపీగా అడుగులో అడుగు వేసు కుంటూ మెట్లన్నీ దిగింది. అదృష్టవశాత్తు.. చలిగాలి వల్ల ఎవరూ యిళ్ల బాల్కనీలలో లేరు– ఎవరూ తనను గమనించడంలేదు. ఆమెకు దుఃఖంతో మనసు ద్రవించిపోతోంది. కళ్లలో నీళ్లు నిండుతున్నాయి.

కొడుకు! ఎంత హుందాగా– ప్రతిష్ఠగా– అందరికీ అతన్ని గురించి చెబుతోంది!.. బుల్‌డోజర్ యిల్లు కూల్చే స్తుంది. రెండు గదుల కొత్త యింటిలో కోడలుచెల్లెలు వచ్చి కాపురం మొదలెడుతుంది!

సుందరమ్మ నీరసంగానే రోడ్డువార నడుస్తోంది.

దొరికినప్పుడు చెట్ల మొదళ్లు, యిళ్ల గోడలు ఆసరాగా చేసుకుని నిలబడి సేద తీర్చుకుంటూంది. అన్ని పక్కల నుంచి – చలిగాలి పగపట్టినట్లుగా విసు రుతూ తగులుతోంది. బుజానికి తగిలించుకున్న సంచి.. ఇప్పుడు ఖాళీదే.. ఎగిరి వచ్చి ముఖానికి కొట్టుకుంది.

తల తిరిగినట్లయింది.

గబ గబ తన యింటి వయిపు నడవాలనుకుంది. ఆవరణ చేరుకుంది.

తీరా.. ఆమె కళ్లు తెరిచి చూచినప్పుడు... ఎక్కడుందో తెలియలేదు. తన యిల్లు కాదు. తన మంచం కాదు.

'ఎలా వున్నారు పిన్నిగారూ?' అనడుగుతోంది అసూయ వున్న అనసూయ.

చుట్టూ వున్న నలుగురయిదుగురు ఆడవాళ్లూ యిదే ప్రశ్న వేస్తున్నారు. ఆతృతగా, బాధగా ఆమె ముఖంలోకి– కళ్లల్లోకి– చూస్తున్నారు.

తన మంచం చుట్టూ.. యిరుగు పొరుగు ఆడవాళ్లు ఆరుగురూ ఆత్రంగా తననే గమనిస్తూ నిలుచుని వుండడం – సుందరమ్మకు కొన్ని క్షణాల్లో గమనానికి వచ్చింది.

'మీ వాళ్లంతా యేమయ్యారురా...'

'మీ యింట్లో చీట్లపేక ఆడుకుంటున్నారు.. మీరు మాత్రం కొత్త యిల్లు ఎలాట్ అయ్యేంత వరకు మా యింట్లోనే వుండిపోదురుగాని. మీ యిల్లు మరీ నీళ్లతో నిండిపోయి, ఏమాత్రం యోగ్యంగా లేదు.. ఈ వయస్సులో మీరు వంటరిగా వుండటానికి...'

సుందరమ్మ అతి కష్టంమీద తన కన్నీళ్లు బయటకు కారిపోకుండా ఆపుకోగలిగింది. అయినా యేదో అతిశయం.. గర్వం.. ఇంకా మనస్సును పీకుతోంది.

'అంతా అకస్మాత్తుగా అలా జరిగిపోయింది. మా అబ్బాయి.. యూనివర్సిటీలో ప్రొఫెసర్ కదా..' అంటూ మొదలెట్టింది.

'మాకు తెలుసుగదా, పిన్నిగారూ!' అని వాళ్లు మొదట్లోనే వారించారు. అయినా..

'వాడు నన్ను ఇంటి బయటిదాకా వచ్చి వీడ్కోలు యిచ్చాడు. వాడు అర్జెంట్‌గా టి.వి. స్టేషన్‌కు వెళ్లవలసి వచ్చింది. టి.వి. ఆన్ చేయండి.. వాడి ప్రసంగం వస్తోందేమో.. నేను ఆవరణలోకి వచ్చాక యేమయిందో నాకు తెలీదు, తల తిరిగినట్లయింది.. నేల జారిందో యేమో...'

–ఆమెను వలయంగా చుట్టేసిన ఆరుగురు ఆడవాళ్ళూ యేమీ మాట్లాడలేదు. సుందరమ్మ మాటలు వింటూ మూగగా వుండిపోయారు. వాళ్లకంతా అర్థం అయింది. అర్థం అయినట్లుగానే తలలు ఊపుతూ ఆమెను ఊరడిస్తున్నారు. ■